సాక్షి ఒడిశా

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,83,258
బంగారం	1 గ్రాము 450 మిల్లీ గ్రాములు
వెండి	46 గ్రాముల 380 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



అమ్మా భవానీ..!

రాష్ట్రమంతటా దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

- IIలో



చిలికాలో సౌరశక్తి పడవలు

త్వరలో చిలికా సరస్సులో సౌరశక్తి లేదా బ్యాటరీతో నడిచే పడవలు తిరుగనున్నాయి.

- IIలో

న్యూస్‌రీల్

ఐఐసీగా అనితా కుమారి



అనితా కుమారి సాహు

బరంపురం: స్థానిక సదర్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా 2012 బ్యాచ్‌కి చెందిన అనితా కుమారి సాహు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆమె కొందమాల్ జిల్లా బల్లిగుడా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడనున్నట్లు వెల్లడించారు. పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

భువనేశ్వర్: కాలువలోకి కారు దూసుకెళ్లడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఖుర్దా సమీపంలోని బరుణై ప్రాంతంలో మంగళవారం ఉదయం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. అయితే మృతుని ఆచూకీ తెలియాల్సి ఉంది. పూరీ, నిరాకర్‌పూర్ రహదారిపై బరుణై సమీపంలో వాహనం అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిందని ప్రత్యేక్ష సాక్షులు పేర్కొన్నారు. దీంతో కారులోనే డ్రైవర్ ఇరుక్కుపోయి మృతి చెందినట్లు తెలుస్తోంది. సమాచారం అందడంతో స్థానిక పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

175 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో మల్కన్‌గిరి ఎస్‌ఐ అమిత్ కుమార్ డాలి తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి 12 గంటలకు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఒక కారు అతివేగంగా రావడంతో ఆపి తనిఖీలు నిర్వహించగా, గంజాయి బస్తాలు ఉండడంతో వెంటనే డ్రైవర్‌ను అరెస్టు చేశారు. పట్టుబడిన వ్యక్తిని మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌కు మంగళవారం తరలించి విచారించగా, కలిమెల సమితి ఎంవీ 77 గ్రామానికి చెందిన విజయ్ డాలి (34)గా తెలిసింది. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పట్టుబడిన 175 కిలోల గంజాయి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలియజేశారు.

విజయవాడకు లగ్జరీ బస్సు ప్రారంభం



బస్సులో కూర్చున్న ఎమ్మెల్యే నారాయణరావు తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ సమితి హడ్డుభంగి నుంచి విజయవాడ (ఆంధ్రప్రదేశ్)కు ప్రైవేట్ హైటెక్ బస్సును పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మంగళవారం హడ్డుభంగి జంక్షన్ నుంచి ప్రారంభించారు. హడ్డుభంగి నుంచి కొత్తూరు, పాలకొండ, రాజాం మీదుగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ వెళ్తుందని తెలియజేశారు.

కార్తీక మాసాన..!

- ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు చర్యలు
- శ్రీమందిరం సీఏవో రంజన కుమార్ దాస్ వెల్లడి
- పూజాదుల అనుబంధ సంచిక ఆవిష్కరణ



నియోగుల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని పూరీ శ్రీజగన్నాథ దేవస్థానంలో ప్రత్యేక పూజాదుల నిర్వహణకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. కార్తీక మాసం పొడవునా నిర్వహించే ప్రత్యేక పూజాదుల కార్యక్రమం ఖరారు చేసి అనుబంధ సంచిక మంగళవారం ఆవిష్కరించారు. శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి రంజన కుమార్ దాస్ అధ్యక్షతన 36 మంది నియోగుల సంఘం ప్రతినిధులతో ప్రత్యేక సమావేశంలో ఈ కార్యక్రమం ఖరారు చేశారు. స్థానిక నీలాద్రి భక్త నివాస్‌లో ఈ సమావేశం జరిగింది.

హబిష్యాలీ వ్రతం

కార్తీక మాసం పురస్కరించుకుని హబిష్యాలీ వ్రతం కోసం ప్రత్యేక ఏర్పాట్లు ప్రధాన శీర్షికగా సమావేశం కొనసాగిందని రంజనన్‌కుమార్ దాస్ తెలిపారు. కార్తీక మాసం పొడవునా అత్యంత నియమ నిష్టలతో ప్రత్యేక వ్రతం ఆచరిస్తారు. ఈ సందర్భంగా నిత్యం వేకువజాము నుంచి అత్యంత నియమ నిష్టలతో రాధా దామోదరుని ఆరాధిస్తారు. నిత్యం ఒంటి పూట శ్రీజగన్నాథుని మహా ప్రసాదం సేవన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈనెల 25 నుంచి నవంబర్ 27వ తేదీ వరకు హబిష్యాలీ వ్రతం షెడ్యూలు ఖరారు చేసింది. నిత్యం తెల్లవారు జామున 4 గంటలకు ఆలయ ప్రధాన తలుపులు తెరుస్తారు. ఈ సందర్భంగా రాధా దామోదర అలంకరణ ఉదయం 6.30 నుండి 7.30 గంటల మధ్య మరియు బాల ధూపం (ఉదయం పూజ) ఉదయం 10 నుంచి 10.30 గంటల మధ్య పూర్తవుతుందని తెలిపారు.

రద్దీ నియంత్రణ

కార్తీక మాసం నెల రోజులు హబిష్యాలీ వ్రతం పురస్కరించుకుని శ్రీమందిరం భక్తుల తాకిడితో కిటకిటలాడుతుంది. రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అనుబంధ వర్గాలకు తెలిపారు. దీనిలో భాగంగా హబిష్యాలీలకు దైవ దర్శనం సంతృప్తిగా కల్పించేందుకు సాధారణ భక్తులు స్వామివారిని దర్శించుకుని వడివడిగా ముందుకు సాగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దర్శనం కోసం అధిక సమయం నిలబడి ఈ వర్గాలకు ఇబ్బంది కలిగించరాదని తెలిపారు. ఇదే నిబంధన ప్రధాన దేవస్థానం సముదాయంలో విస్తరించి ఉన్న పలు ఉప ఆలయాల్లోనూ అనుసరించాలని స్పష్టం చేశారు.



కార్తీక మాసం ప్రత్యేక సంచిక విడుదల

చంద్ర గ్రహణం

పాక్షిక చంద్ర గ్రహణం పురస్కరించుకుని ఈనెల 28న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 2 గంటలకు ఆలయ ప్రధాన తలుపులు తెరుస్తారు. 4.30 నుంచి 5.30 గంటల మధ్య రాధా దామోదర అలంకరణ ఉదయం 8 నుండి 8.30 గంటల మధ్య బాలభోగం, మధ్యాహ్నం 2 గంటలకు దేవతల మహాస్నానం కార్యక్రమం పూర్తి చేస్తారు.

బాణాసంచా గోదాముపై దాడులు



నిందితులను అరెస్టు చేస్తున్న పోలీసులు







పోలీసులు సీజ్ చేసిన బాణాసంచా

బరంపురం: స్థానిక పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి త్రివేణి నగర్‌లో లైసెన్స్ లేకుండా బాణాసంచా భద్రపరిచిన గోదాముపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఐఐసీ భూపతి మహంతి తెలిపిన వివరాల మేరకు.. త్రివేణీ నగర్‌లో కొద్ది రోజులుగా ఎటువంటి అనుమతి లేకుండా ఒక గోదాములో బాణాసంచా ఉంచినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో దాడిచేసి లక్షలాది రూపాయులు విలువ చేసే బాణాసంచా స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుల్లో బలరామ్ సాహు, కె.మోహన్‌రావులు ఉన్నట్లుగా గుర్తించారు.

గంధం చెక్కలు స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న చెక్కలను చూపిస్తున్న పోలీసులు

కొరాపుట్: అక్రమంగా రవాణా అవుతున్న 120 కేజీల గంధం చెక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కొరాపుట్ జిల్లా పొట్టంగి పోలీసుస్టేషన్ పరిధిలో మాలిపుంగార్ గ్రామం వద్ద గంధం చెక్కలు అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో తనిఖీలు చేపట్టగా ఒక వ్యాన్‌లో రవాణా అవుతున్న గంధం చెక్కలు పట్టుబడ్డాయి. దీనిని రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన కృష్ణ పంగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చెక్కలను సీజ్ చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. ఏఎస్‌ఐ నర్సింగ దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు

- గర్భిణి దుర్మరణం



ప్రమాదానికి గురైన బస్సు, బైక్

జయపురం: విజయవాడ-రాంచీ 326వ జాతీయ రహదారి బొయిపరిగుడ-మల్కన్‌గిరి రోడ్డులో మంగళవారం ఒక బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో గర్భిణీ దుర్మరణం పాలయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. మల్కన్‌గిరి జిల్లా ఖొయిర్‌పుట్ సమితి మడకపాదర్ పంచాయతీ కాత్రకుండలో నివాసముంటున్న సుక్రు పంగి, అతడి భార్య పూర్ణ పంగి(20)లు తమ ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బొయిపరిగుడకు వస్తున్నారు. ఆ సమయంలో పంద్రిపాణి సమీపంలో ఎదురుగా వస్తున్న ఒక బస్సు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో పూర్ణ పంగి మరణించగా సుక్రు పంగి(25) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బొయిపరిగుడ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వచ్చి ప్రమాదానికి గురైన ఇరువురుని అంబులెన్స్‌లో వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. వారిని పరిశీలించిన డాక్టర్లు అప్పటికే పూర్ణ పంగి మరణించినట్లు ధ్రువీకరించారు. సుక్రు పంగి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అతడిని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మరణించిన పూర్ణ పంగి 4 నెలల గర్భవతి. వారి బంధువల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపించారు. ప్రమాదానికి కారణమైన బస్సు, బైక్‌లను సీజ్ చేసినట్లు పోలీసు అధికారి సుకాంత కుమార్ శతపతి వెల్లడించారు.

'పార్వతీపురానికి బస్సులు నడపండి'



ఎంపీ రమేష్ చంద్ర

కొరాపుట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి ఒడిశా రాష్ట్రంలోని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాన్ని కలుపుతూ ప్రత్యేక ఓఎస్ ఆర్టీసీ బస్సులు నడపాలని నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ సీఎండీకి లేఖ రాశారు. పార్వతీపురం - నారాయణపట్న - కొరాపుట్ - నబరంగ్‌పూర్‌ల మధ్య నడపాలని కోరారు. ఆయా ప్రాంతాలను కలుపుతూ వేలాది మంది తెలుగు ప్రజలు స్థిరపడ్డారని పేర్కొన్నారు. తరతరాలుగా ఈ రెండు పట్టణాల ప్రజల్లో బాంధవ్యాలు కొనసాగుతున్నాయని తెలియజేశారు. అందువలన కొత్త ప్రత్యేక బస్సు వేయాలన్నారు. అందుకు తగ్గ అవకాశం లేకపోతే ప్రస్తుతం పార్వతీపురం- జయపురం మధ్య నడుస్తున్న బస్సును నబరంగ్‌పూర్‌కు పొడిగించాలని పేర్కొన్నారు. ఈ డిమాండ్‌పై ఇటీవల నబరంగ్‌పూర్ వచ్చిన బీజేడీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బబీ దాస్‌కి తెలుగు సంఘాల ప్రతినిధులు లేఖ ఇచ్చారు.

29 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు

బరంపురం: గంజాం జిల్లాలోని ధారకోట్ నలియా బొంద శివాలయం దగ్గర గత కొద్దిరోజుల నుంచి రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి 29 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన ఘటన సంచలనంగా మారింది. ఎస్పీ జగ్‌మోహన్ మీన తెలిపిన వివరాల మేరకు.. అస్కా పోలీసుస్టేషన్ పరిధి ధారకోట్ గల నలియా బొందా శివాలయం దగ్గర జూదం అడ్డా నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సోమవారం అర్ధరాత్రి జూదం అడ్డాపై దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా 29 మందిని అరెస్టు చేయడంతో పాటు రూ.6.70 లక్షల నగదు, 20 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్య



విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



చెట్టుకు ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్న డొంబురు

జయపురం: స్థానిక మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఒక వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి పారాబెడ పరజాసాహికి చెందిన డొంబురు పొరజ(46)గా గుర్తించారు. ఆత్మహత్య చేసుకున్న డొంబురు తన చాతిపై గతంలో మరణించిన భార్య లక్ష్మీ పొరజ ఫొటోతో పాటు తన ఫొటో పెట్టుకొని విక్రమదేవ్ విశ్వవిద్యాలయం వెనకనున్న ఒక చెట్టుకు ఉరిపోసుకున్నాడు. ఈ విషయం తెలిచిన జయపురం పట్టణ పోలీసులు సంఘటన ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో వెల్లడించారు. డొంబురుకి ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేశాడు. మిగతా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. అతడి భార్య లక్ష్మీ హరిజన్ 10 నెలల క్రితం మరణించింది. అప్పటి నుంచి అతడు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే అతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపిస్తున్నారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్లు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారి హరీష్ బీసీ



పట్టుబడిన సైబర్ నేరగాళ్లు

జయపురం: కొరాపుట్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొన్నేళ్లుగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బి.సి తెలియజేశారు. స్థానిక సదర్ పోలీసుస్టేషన్ సభా గృహంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టేందుకు జరిపిన దర్యాప్తులో ముగ్గురు నేరగాళ్లను అరెస్టు చేసి విచారించగా అనేక సైబర్ నేరాలు బయటపడినట్లు వెల్లడించారు. వారు సుమారు రూ.2 కోట్లకు పైగా డబ్బు కాజేసినట్లు తెలిసిందన్నారు. అరెస్టైనవారు సెమిలిగుడ గ్రామానికి చెందిన బలరాం దాస్(42), కేంద్రపడ జిల్లా బెలపడ గ్రామానికి చెందిన సత్యరంజన్ సాహు(33), ఖుర్దా జిల్లా భరత్‌పూర్ పీఎస్ పరిధి ఖండగిరి గ్రామానికి చెందిన రాజీవ్ కుమార్ ప్రసాద్(42)లు అని వెల్లడించారు. వీరు బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న డబ్బును వారి ఖాతాలు నుంచి దోచుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రజలకు బ్యాంక్ రుణాలు రూ.1.50 లక్షల వరకు ఇప్పిస్తూ, వారి బ్యాంక్ పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులు, ఏటీఎం కార్డులు, ఆర్ఏఆర్‌లు లబ్దిదారుల నుంచి స్వాధీన పరచుకునేందుకు మేనేజ్ చేస్తున్నారని, ఆవిధంగా డబ్బులు దోచుకుంటూ ప్రజలను మోసగిస్తున్నారని వెల్లడించారు.

క్లుప్తంగా

99 పోస్టులకు త్వరలో నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో 99 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ ఎ.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు పాలక మండలి, అకడమిక్ సెనేట్, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌ల్లో చర్చించి అనంతరం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. నియామక ప్రక్రియలో రిజర్వేషన్ రోస్టర్ పక్కాగా అమలు ఉంటుందని తెలిపారు. నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి కసరత్తు చివరి దశకు చేరిందని వివరించారు.

'కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం'

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, జిల్లాలో పార్టీ పూర్వవైభవాన్ని తిరిగి తీసుకొస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర పార్టీల్లో ఉన్న కాంగ్రెస్ నేతలను 'మన ఇంటికి రండి' అనే నినాదంతో తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని భాష్యం స్కూలు సమీపంలో బైక్ ఢీకొని ఇద్దరు గాయపడినట్లు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకరమణ పేర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న రాజేష్ ప్రసాద్ సాహు మండల వీధిలో నివాసముంటున్నాడు. ఈయన స్వస్థలం పశ్చిమబెంగాల్. సోమవారం రాత్రి భోజనం కోసం మండల వీధి నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అతనికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడు కూడా కింద పడడంతో అతనికీ దెబ్బలు తగిలాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

'కిట్లు వినియోగించుకోవాలి'



కార్యకర్తల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చిన పూర్వ ప్రాథమిక విద్యా కిట్లను కార్యకర్తలు వినియోగించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతి శ్రీ సూచించారు. ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అభివృద్ధి చేసేందుకు పీపీ-1, పీపీ-2 కిట్లు అందించామని, వాటిని కట్టలు కట్టి పడేయకుండా కేంద్రాలకు హాజరయ్యే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలన్నారు. టీహెచ్‌ఆర్ పిల్లలకు బాలామృతం వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు గత కొన్ని నెలల నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ద్వారా టీహెచ్‌ఆర్ కిట్లు అందిస్తున్నామని ప్రతి ఒక్క కార్యకర్త వంద శాతం ఎఫ్‌ఆర్‌ఎస్ జరిగేటట్లు చూడాలన్నారు. ఆమెతో పాటు నోడల్ ఆఫీసర్ మణి, సీడీపీఓ హెచ్‌కే కామాక్షి, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమస్యల విన్నపం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు మంగళవారం సాయంత్రం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా భూ సేకరణ యూనిట్‌లు ఎత్తివేయడం సరికాదని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఇంకా జిల్లాలో భూ సేకరణ చేయాల్సి ఉందని, ఈ పరిస్థితుల్లో ఆ యూనిట్ల అవసరం ఎంతైనా ఉందని వారు కలెక్టర్‌కు తెలిపారు. రెవెన్యూ శాఖలో వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని తెలిపారు. గత ఎన్నికల్లో కొన్ని మండలాల్లో ఉన్న పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. క్రమశిక్షణ సర్వీసుల కేసులు ఉన్నాయని, వాటిని దర్యాప్తు చేసి, పరిష్కరించాలని కోరారు. స్టేషనరీకి నిధులు విడుదల చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రెవెన్యూ సర్వీసుల సంఘం జి ల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షు డు పప్పల వేణుగోపాలరావు, కార్యదర్శి బీవీవీఎస్ రాజు, కోశాధికారి జీఎల్ శ్రీనివాసరావు, యూనియన్ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, డి.సోనీకిరణ్, కె.ప్రవల్లికా ప్రియ, డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు సంతోష్ ఉన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి లాలాపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న వల్లిశెట్టి రాజేష్‌ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంఈఓ కె.అప్పారావు తెలిపారు. పెళ్లి పేరుతో సహ ఉపాధ్యాయురాలిని మోసగించినట్లు గత నెల 20న వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఈ కేసులో విచారణ చేపట్టి ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలియజేశారు.



రాయగడ: ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



భువనేశ్వర్: జాజ్‌పూర్ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గాయత్రీ స్వరూపంలో పూజలందుకుంటున్న దుర్గామాత



రాయగడ: అన్నపూర్ణమ్మ అవతారంలో దక్షిణ కాళి



భువనేశ్వర్: ఝుంజిరి మంగళా మాత ఉగ్రతార స్వరూపం



భువనేశ్వర్: గొదొ చండీమాత బొగొళా ముఖి దర్శనం

అమ్మా భవానీ..!

రాష్ట్రమంతటా దేవీ నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఒక్కో ప్రాంగణంలో ఒక్కో రూపంలో శక్తి స్వరూపిణి దర్శనం భక్తులకు ప్రాప్తిస్తోంది. రేయింబవళ్లు పూజా ప్రాంగణాలు దేవీ నామ పారాయణం ఇత్యాది పూజలతో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: విశేషాలంకరణలో పాలపోలమ్మ



భువనేశ్వర్: భువనేశ్వరి అలంకరణలో కటక్ చవులియా గంజ్ జయదుర్గ అమ్మవారు



భువనేశ్వర్: మహేశ్వరి స్వరూపంలో దర్శనమిచ్చిన వాసంతి దుర్గాదేవి



భువనేశ్వర్: హరచండీ స్వరూపంలో కటక్ చండీమాత



పర్లాకిమిడి: మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారు



బరంపురం: మార్వడి సమాజ్ దాండియా నృత్య ప్రదర్శన



బరంపురం: బెజ్జిపూర్‌లో పూజలు జరుగుతున్న దృశ్యం



పర్లాకిమిడి: బాలత్రిపుర సుందరీ దేవి అవతారంలో దుర్గాదేవి



పర్లాకిమిడి: బాలసదన్ పాఠశాలలో శరన్నవరాత్రి ఉత్సవాలు



బరంపురం: పాత బస్టాండ్ దుర్గా పండాల్లో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



పర్లాకిమిడి: బాలసదన్ పాఠశాలలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

చిలికాలో సౌరశక్తి పడవలు

- ప్రభుత్వానికి ఒరేడా ప్రతిపాదన



ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: త్వరలో చిలికా సరస్సులో సౌరశక్తి లేదా బ్యాటరీతో నడిచే పడవలు తిరుగుతాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. చిలికా సరస్సు కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వానికి ఒడిశా రెన్యూవబుల్ ఎనర్జీ డవలప్‌మెంట్ ఏజెన్సీ (ఒరేడా) ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదన ప్రవేశపెట్టింది. అదనపు ముఖ్య కార్యదర్శి నికుంజ బిహారీ ధొలా, రాష్ట్ర పర్యటన శాఖ డైరెక్టర్ సచిన్ రామచంద్ర యాదవ్, అటవీ మరియు పర్యావరణం, జంతు వనరులు, మత్స్య శాఖ, కాలుష్య నియంత్రణ మండలి మరియు ఒరేడా సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాలుష్య రహితంగా..

డీజిల్‌తో నడిచే పడవలను నడపడం వల్ల నీటి కాలుష్యం, వాయు కాలుష్యం మరియు ధ్వని కాలుష్యం ఇతరేతర పలు రకాల కాలుష్యాలు చిలికా సరస్సు నీటిని కలుషితం చేసే ముప్పు తొలగించే ప్రయత్నంలో భాగంగా సౌరశక్తి లేదా బ్యాటరీతో నడిచే పడవల రవాణా ప్రవేశం ప్రతిపాదన లక్ష్యంగా పేర్కొన్నారు. సౌరశక్తితో లేదా బ్యాటరీతో నడిచే పడవలు మొదట్లో కొంచెం ఖరీదైనవి అయినప్పటికీ, వార్షిక నిర్వహణ మరియు నిర్వహణ తక్కువగా ఉంటుంది. ఒరేడా ప్రయోగాత్మకంగా ఈ ప్రతిపాదనని వాస్తవ కార్యాచరణలో ప్రవేశ పెట్టాలని ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో సాంకేతిక, వాణిజ్య - రవాణా శాఖలు ఈ అంశాన్ని అధ్యయనం చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఫిషింగ్ మరియు టూరిస్ట్ బోట్లను వాటి డిజైన్‌లో అవసరమైన మార్పులు చేయడం ద్వారా సౌరశక్తితో నడిచే ఎలక్ట్రిక్ బోట్లుగా మారుస్తారు. మత్స్యకారులు, టూరిస్ట్ బోట్ ఆపరేటర్లు మరియు ప్రయోజనం పొందే ఇతర వాటాదారులందరికీ కొత్త బోట్ల సులభ నిర్వహణ మరియు నిర్వహణపై అవగాహన కల్పిస్తారని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇంధన శాఖ, ఓటీడీసీ, మత్స్య మరియు జంతు వనరుల శాఖ, అటవీ - పర్యావరణం, వాతావరణ మార్పుల శాఖ సహకారంతో ఒరేడా పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తుంది. తొలిదశలో చిలికాలోని వివిధ ప్రదేశాలలో సౌరశక్తితో నడిచే బోట్లను నడపడానికి అవసరమైన సన్నాహాలు చేయాలని ఒరేడాకు ఆదేశించారు.

ప్రతిభకు ప్రోత్సాహం



ముఖ్యమంత్రి నవీన్ చేతులమీదుగా చెక్ అందుకుంటున్న జెనా

భువనేశ్వర్: ఇటీవల హాంగ్‌జౌలో ముగిసిన ఏషియన్ గేమ్స్‌లో అద్భుత ప్రతిభ ప్రదర్శించిన రాష్ట్ర క్రీడాకారుడు జావెలిన్ స్టార్ కిషోర్ కుమార్ జెనా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతుల మీదుగా కోటిన్నర రూపాయల నగదు పురస్కారం మంగళవారం అందుకున్నారు. స్థానిక నవీన్ నివాస్‌లో ముఖ్యమంత్రి ఆయనకు ప్రత్యేకంగా అభినందించారు. కిషోర్ కుమార్ జెనా రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. త్వరలో జరగనున్న పారిస్ ఒలింపిక్స్-2024లో పాల్గొనేందుకు అర్హత సాధించడం రాష్ట్రానికి మరియు దేశానికి గర్వ కారణమని ముఖ్యమంత్రి అభినందించారు.

కిషోర్ రాష్ట్రానికి మరిన్ని అవార్డులు తీసుకువస్తారని ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తం చేస్తూ, ఒలింపిక్స్‌లో విజేతగా నిలవాలని శుభాకాంక్షలు తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన



శిక్షణ ప్రారంభించి మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ

ఆమదాలవలస:

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ సూచించారు. ఆమదాలవలస పట్టణంలోని ధర్మారావు క్వార్టర్స్‌లో అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఎంవీ ఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ యూనిట్స్ విశాఖపట్నం, ముల్లేటి వెంకటరావు వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ-ఉపాధి కల్పన వృత్తిబడి కార్యక్రమాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. మహిళలు కుటుంబాన్ని ఎలా జాగ్రత్తగా నడిపిస్తారో అంతే శ్రద్ధతో చేతి వృత్తులు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. అరుణోదయ లాంటి స్వచ్ఛంద సంస్థలు ఇలా ముందుకువచ్చి యువతకు శిక్షణలు అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. టైలరింగ్, మగ్గం క్యాండిల్స్, తయారీ ఫినాయిల్, సర్ఫ్ తయారీ, మష్రూమ్స్ తయారీ, అప్పడాల తయారీ, వైరు బ్యాగులు అల్లడం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలోఅరుణోదయ సంస్థ వ్యవస్థాపకులు అరుణ్‌కుమార్, శ్రీనివాస రావు, ఎన్జీవో డైరెక్టర్ రవి, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు లక్ష్మీనారాయణ, కేసరి అప్పలరాజు, గౌతమ్ పట్టణ తదితరులు పాల్గొన్నారు.

బార్ ప్రతినిధులతో సమావేశం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాతపట్నం, కొత్తూరు, పొందూరు, రాజాం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి పిటిషన్‌పై ఒక రూపాయి స్టాంపుతో పాటు అదనంగా మరో రూ.20 వెల్ఫేర్ స్టాంపు అతికించాలని బార్ కౌన్సిల్ వారు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ సంక్షేమ నిధి స్టాంప్ రుసుం పెంపును అందరు న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం న్యాయవాదులకు చెల్లిస్తున్న సంక్షేమ నిధిని నా లుగు లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని జిల్లాలోని వివిధ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారని వివరించారు.

జాతీయ అవార్డు అందుకున్న అనుపమ్



రాష్ట్రపతి ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న అనుపమ్ పట్నాయక్

భువనేశ్వర్: జాతీయ స్థాయిలో ఉత్తమ ఒడియా చలన చిత్రంగా ప్రతీక్ష్య సినిమా ఎంపికైన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా దర్శకుడు అనుపమ్ పట్నాయక్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు కింద రజత కమలం మరియు రూ.1,00,000 నగదు పురస్కారం అందుకున్నారు. దీపన్విత్ దాస్ మహాపాత్రో, చౌదరి జయప్రకాష్ దాస్, బొర్షా పట్నాయక్, శ్రీలా త్రిపాఠి, రూపాంబికా నాయక్, సుశీల్ మిశ్రా, ఒబొకాష్ మిశ్రా మరియు సిద్ధాంత్ మహాపాత్రోలు నటించిన ఈ చిత్రాన్ని అమియా పట్నాయక్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించారు. ఈ చిత్రం సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మరియు పాత్రికేయుడు గౌరహరి దాస్ రాసిన బప్పా (నాన్న) అనే చిన్న కథ ద్వారా తెరకెక్కించారు. 2022వ సంవత్సరంలో వాషింగ్టన్ డీసీ (అమెరికా)లో జరిగిన 11వ వార్షిక డీసీ దక్షిణ ఆసియా చలన చిత్రోత్సవంలో ప్రతీక్ష్య ఉత్తమ కథా అవార్డును అందుకుంది. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని వెండి తెరకి ఎక్కించి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకునే రీతిలో సినిమా తీశారు.

సాహిత్యంతోనే భాష మనుగడ



శుభశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జయపురం: సాహిత్యంతోనే భాష మనుగడ సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక టౌన్ హాల్‌లో ఛిండానొయి సాహిత్య సంసద్, జయపురం వారు నిర్వహించిన సంసద్ వార్షికోత్సవంలో 'మన సాహిత్యం ఎంత సురక్ష' అన్న అంశంపై చర్చావేదిక మంగళవారం జరిగింది. అలాగే కవితా సమ్మేళనాలు నిర్వహించారు. ఛిండానొయ సాహిత్య సంసద్ అధ్యక్షుడు మన్‌మోహన్ ఆచార్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విక్రమదేవ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ దేవీ ప్రసాద్ మిశ్రా మాట్లాడుతూ ఒడియ భాషకు కాలక్రమేణా ఆదరణ తగ్గుతోందని, అందువలన మన భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. భాషాభివృద్ధికి సాహిత్యమే ప్రాణమని పేర్కొన్నారు. సాహిత్యాన్ని భావి తరాలకు అందించేందుకు సాహితీవేత్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ భవానీ శంకర దాస్ మాట్లాడుతూ భాషా పరిరక్షణకు సాహిత్యకారులు కవితలు, వ్యాసాలు, కథలు ఎక్కువ రచనలు చేసి యువతకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఛిండానొయ సాహిత్య సంసద్ కార్యదర్శి జుధిష్టర్ మల్లిక్, ప్రొఫెసర్ డాక్టర్ భైరవ చరణ్ పట్నాయక్, వ్యాస రచయిత శుధాంసు శేఖర పట్నాయక్, హర్షిత పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శుభశ్రీ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

జాతీయ హాకీ పోటీలకు తరుణ్ ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన హాకీ ఆటగాడు అంపోలు తరుణ్‌కుమార్ మరోసారి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ బాలుర జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ పోటీలు ఈనెల 17 నుంచి 23 వరకు జరుగుతున్నాయి.

తండ్రి ప్రోత్సాహంతో..

చిన్నప్పటి నుంచి హాకీపై మక్కువ పెంచుకున్న అంపోలు తరుణ్‌కుమార్‌ది వ్యవసాయ కుటుంబం. వీరి స్వస్థలం ఎచ్చెర్ల మండలం చిన్నపూడివలస గ్రామం. తండ్రి అంపోలు బాలకృష్ణ వ్యవసాయం చూసుకుంటునే ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, తల్లి వెంకటరత్నం గృహిణి. ప్రస్తుతం తరుణ్‌కుమార్ జెడ్పీహెచ్‌స్కూల్ కింతలిలో పదో తరగతి చదువుతున్నాడు. నాటి డీఎస్‌ఏ కోచ్‌గా పనిచేసిన బాలమురళీ వద్ద హాకీలో ఓనమాలు నేర్చుకున్నాడు. ఆ తర్వాత మరో సీనియర్ ఆటగాడు అనిల్ వద్ద, ప్రస్తుతం డీఎస్‌ఏ కోచ్‌గా వ్యవహరిస్తున్న పైడి చంద్రశేఖర్(చందు) వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఇతని తమ్ముడు సాయిచంద్ కూడా హాకీ గేమ్‌నే ఎంచుకుని రాణిస్తున్నాడు. తండ్రి ప్రోత్సాహంతోనే వీరు ఆటల్లో రాణిస్తున్నారు.

అనతి కాలంలో..

తరుణ్ హాకీ గేమ్‌లో రైట్ ఆఫ్, రైట్ అవుట్‌లలో రెండింటా దిట్టగా పేరుగాంచాడు. నిరంతరం ఆటలో మెలకువలు నేర్చుకుంటూ అనతి కాలంలో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగాడు. యలమంచిలి, అనంతపురం, కాకినాడలో జరిగిన సబ్‌జూనియర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. గూడురులో జరిగిన సౌత్‌జోన్ నేషనల్స్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయాడు. కోచింగ్ క్యాంప్‌లో అదరగొట్టి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. తాజాగా ఈ నెల 17 నుంచి చెన్నైలో జరుగుతున్న సబ్-జూనియర్స్ సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఎంపికయ్యాడు.

క్లుప్తంగా

19న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి మంగళవారం తెలిపారు. నగరంలోని రింగ్‌రోడ్ ప్రాంతంలో గల ఫైర్ చెస్ స్కూల్‌లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీలో నిర్వహించే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది క్రీడాకారులకు రూ.30వేల నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు, పేర్ల నమోదు కోసం ఆర్బిటర్ ఫోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

5కే రన్ విజేతలకు నగదు బహుమతి అందజేత



నగదు బహుమతి అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల విజ్జీస్టేడియంలో నిర్వహించిన 5కే రన్ విజేతలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొదట విజేత పి.సాయికి రూ.10 వేలు, రెండో విజేత ఎస్.అశోక్‌కు రూ. 7 వేలు, మూడో విజేత పి.నితిన్‌కు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, పి.బాలాజీ, సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో పాచిపెంట యువకుడికి కాంస్యం



కాంస్య పతకం సాధించిన ముల్లు హరీష్

పాచిపెంట: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15,16,17వ తేదీల్లో జేఎన్ స్టేడియం వరంగల్‌లో నిర్వహించిన 34 సౌత్ జోన్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో పాచిపెంట యువకుడు ముల్లు హరీష్ ప్రతిభ కనబరిచాడు, 3000 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం సాధించి కాంస్య పతకం పొందాడు, ఈ సందర్భంగా హరీష్, కోచ్ నేతేటి శేఖర్‌లకు మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పూసపాటిరేగ: ఎస్‌ఈబీ సిబ్బంది పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

పూసపాటిరేగ/ భోగాపురం: మండలంలోని కొప్పెర్ల గ్రామంలో గల చంపావతి నది నుంచి అనుమతిలేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు స్పెషల్‌ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఎస్సై ఇ.రామకృష్ణ మంగళవారం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను, కొప్పెర్లకు చెందిన డ్రైవర్ పల్ల వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించి చెప్పారు. అలాగే భోగాపురం మండలకేంద్రంలోని జాతీయరహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా నాతవలస చంపావతి నది నుంచి భోగాపురం వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌కు అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి భోగాపురం స్టేషన్‌కు అప్పగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



అప్పలనాయుడు మృతదేహం

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మధుపాడ గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని బంగారమ్మ పేట గ్రామానికి చెందిన బోని అప్పలనాయుడు(55) మృతి చెందాడు. ఈ ప్రమాదంపై గజపతినగరం ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గజపతినగరం నుంచి బంగారమ్మపేట గ్రామానికి వెళ్లేందుకు మధుపాడ గ్రామ కూడలి వద్ద బస్సు దిగిన అప్పలనాయుడు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు వెంకటేష్, కుమార్తె చిన్నమ్ములు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సంక్షేమ పాలనపై ఇతర రాష్ట్రాల ప్రశంసలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- వీలుపర్తిలో గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు సభ



గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు సభలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్‌చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమం, సుపరిపాలనపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రశంసలు కురిపిస్తున్నారని, సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా అందిస్తున్న పాలనకు ప్రజలు అండగా నిలవాలని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వేపాడ మండలంలోని వీలుపర్తి గ్రామంలో ముగిసిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. హామీలను అమలు చేయడమే కాకుండా ఇంటింటికీ ఎమ్మెల్యేలను పంపించి ఇంకా సమస్యలుంటే తెలుసుకోమని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు.

జనవరి నుంచి పింఛన్ రూ.మూడు వేలు

ప్రభుత్వం వచ్చే 2024 జనవరి నెల నుంచి సామాజిక పింఛన్ రూ.మూడు వేలు చేయనుందని చెప్పారు. ఈ సందర్భంగా వచ్చే జనవరి 1 నుంచి 10 తేది వరకు పింఛన్‌ల పంపిణీ సంబరాలు నిర్వహిస్తామని తెలిపారు.

మోసం చేసిన టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని, జన్మభూమి కమిటీలతో అర్హులకు అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు.

18 సచివాలయాల్లో జీజీఎంపీ విజయవంతం

మండలంలోని 18 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతం చేయడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బందికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనిసరావు కృతజ్ఞతలు తెలిపారు. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ 279 రోజున వీలుపర్తిలో వేపాడ మండలం జీజీఎంపీ ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గోకేడ సత్యంనాయడిని అభినందించారు. 18 సచివాలయాల్లో 13,034 కుటుంబాలను కలిసి వారు పొందిన సంక్షేమాన్ని వివరించి సమస్యలు అడిగి తెలుసుకోగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. వేపాడ మండలంలో 16,083 గృహాలుండగా 13034 గృహాలను సందర్శించి వారికి సంక్షేమ పథకాలు వివరించాగలిగామని చెప్పారు. సంక్షేమం అభివృద్ధిని పార్టీలకతీతంగా అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా నిలవాలని కోరారు. మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు ఎమ్మెల్సీ రఘురాజు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలనాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పద్మావతి, మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి, రణస్థలం ఎంపీపీ వాసు తదితర ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులంతా శుభాకాంక్షలు తెలిపారు.



ముగింపు సభలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

20 నుంచి రాగుల కొనుగోలు కేంద్రాలు

- క్వింటాకు మద్దతు ధర రూ.3,846



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్

పార్వతీపురం: రాగుల కొనుగోలు కేంద్రాలు పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ నెల 20వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి నాయక్ తెలిపారు. ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మాదిరిగా రైతులు పండించిన రాగుల పంట కూడా ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రైతులు పండించిన రాగులను ప్రభుత్వం ప్రకటించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా దగ్గరలో గల రాగుల కొనుగోలు కేంద్రం వద్ద విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని కోరారు. రాగుల కొనుగోలు విషయంలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. రాగులకు ప్రభుత్వం క్వింటాకు రూ. 3,846 మద్దతు ధరగా ప్రకటించిందని చెప్పారు. వ్యవసాయశాఖ అంచనాల మేరకు జిల్లాలో 936 మెట్రిక్ టన్నుల దిగుమతి వస్తుందని, అందులో స్థానిక వినియోగం మినహా 468 మెట్రిక్ టన్నులు కొనులుకు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు.

11 కొనుగోలు క్లస్టర్ల ఏర్పాటు

వ్యవసాయ శాఖ అంచనాలకు అనుగుణంగా రైతుల సౌకర్యార్థం జిల్లాలోని సీతంపేట, సాలూరు, పాచిపెంట, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, గుమ్మలక్ష్మీపురంలో ఉన్న 49 రైతు భరోసా కేంద్రాలను 11 రాగుల కొనుగోలు క్లస్టర్లుగా గుర్తించినట్లు వివరించారు. రాగుల కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సమస్యల సమాచారానికి కంట్రోల్ రూమ్ నంబర్ 08963221003ను ఏర్పాటు చేశామని చెప్పారు. రాగుల కొనుగోలుకు సంబంధించి రైతుల సందేహాల నివృత్తి, సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ నంబర్‌కు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

- ఖోఖో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు
- క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు విజేతలుగా నిలవాలని జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలో జూనియర్స్ విభాగంలో జరగబోయే అంతర్ జిల్లాల బాల,బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులకు దాతలు సమకూర్చిన క్రీడాదుస్తులను మంగళవారం అందజేశారు. ఈ మేరకు నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధమవుతున్న జిల్లా క్రీడాకారులకు అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా బాలుర జట్టుకు పోలీస్ ఖోఖో జట్టు సభ్యులు, బాలికల జట్టుకు క్రీడాభిమాని కిలపర్తి లోహిత్ సమకూర్చిన దుస్తులను అందజేసినట్లు చెప్పారు. క్రీడాకారులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు అర్హత సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరరావు, అసోసియేషన్ ప్రతినిధులు రంగారావు, గోపాల్, రామారావు, కమలనాభరావు, బాలకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజా కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవింద రావు

- పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోలు
- జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

పార్వతీపురంటౌన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన వరి పంటలో ప్రతి గింజనూ పక్కా ప్రణాళికతో కొనుగోలు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ సంఘం సభ్యులతో 2023–24 సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానంపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు పండించిన పంటకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి గింజ కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 83 కొనుగోలు కేంద్రాలకు సుమారు 80 లక్షల మేరకు గోనె సంచులు అవసరం కాగా ప్రస్తుతానికి మొదటి దశలో 20లక్షల సంచులను రైస్ మిల్లర్లకు అందివ్వాలని చెప్పారు. గోనె సంచులను వారం రోజుల్లోగా ఆయా రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసి నిల్వ ఉంచాలని చెప్పారు. ఆర్డీఓ, ఉప రవాణా కమిషనర్, ధాన్యం రవాణా సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో రైతు ధాన్యం రవాణా, చార్జీల చెల్లింపు వివరాలను కచ్చితంగా పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి కలెక్టర్ తీసుకువెళ్లినట్లు తెలిపారు.

టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు

రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఎటువంటి సందేహాలు, ఇబ్బందులు ఉన్నా పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలో 24గంటల రెవెన్యూ రవాణా శాఖ సహకార వ్యవసాయశాఖ జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు అందుబాటులో ఉండి పనిచేసే విధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి కె.హేమలత, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్. శివప్రసాదరావు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ దేవుళ్ల నాయక్, ఏపీడీ వై.సత్యంనాయుడు, జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జున రెడ్డి, జిల్లా సహకార అధికారి బి.సన్యాసినాయుడు జిల్లా మార్కెటింగ్ సహాయ సంచాలకుడు వై.సుధీర్, జిల్లా గిరిజన సహకార సంస్థ డివిజన్ మేనేజర్ మహేంద్రకుమార్, మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రికార్డ్సులో ప్రవల్లిక

విజయనగరం టౌన్: ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యూజిషియన్స్ అండ్ డ్యాన్సర్స్ (ఐసీఎండీఏ), విజయవాడ ఆధ్వర్యంలో అయిగిరి నందిని స్తోత్రం కూచిపూడి నృత్యప్రదర్శన ప్రపంచ వ్యాప్తంగా గతేడాది డిసెంబర్ నెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విశాఖకు చెందిన సాయినాథ్ కళాసమితి నేతృత్వంలో పాల్గొన్న జిల్లాకు చెందిన కోలక ప్రవల్లిక అత్యుత్తమ ప్రతిభ కనబర్చి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుసంపాదించుకుంది. దీంతో పాటు మరో తొమ్మిది ప్రశంసాపత్రాలను కైవసం చేసుకున్నట్లు ఆమె మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ సందర్భంగా అకాడమీ సభ్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



అకాడమీ గురువు సాయికుమార్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కోలక ప్రవల్లిక

మిస్టర్ ఆంధ్రా పోటీల్లో జిల్లా బాడీబిల్డర్ల సత్తా



మిస్టర్ ఆంధ్రా పోటీల్లో పాల్గొన్న బాడీ బిల్డర్లు

విజయనగరం: విశాఖ వేదికగా జరిగిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన బాడీ బిల్డర్‌లు సత్తా చాటారు. ఈ నెల 15న నిర్వహించిన పోటీల్లో తమ ప్రతిభా పాటవాలతో విజయనగరం ఖ్యాతిని చాటి చెప్పిన క్రీడాకారులను జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు, కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావులు మంగళవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో 80 కేజీల విభాగంలో పాల్గొన్న వి.రమేష్ ద్వితీయ స్థానం కైవసం చేసుకోగా..ఇదే కేటగిరీలో ప్రాతినిధ్యం వహించిన మరో క్రీడాకారుడు డి.రమణ 4వ స్థానం దక్కించుకున్నాడు, అలాగే 55 కేజీల విభాగంలో పోటీపడిన రాజేష్ 5వ స్థానం, 60 కేజీల విభాగంలో పాల్గొన్న కె.కిరణ్ 6వ స్థానం, 50 కేజీల విభాగంలో ప్రాతినిధ్యం వహించిన బి.కార్తికేయ 4వ స్థానం దక్కించుకున్నారు.

పూడమ్మతల్లి వారాలు

నెల్లిమర్ల: నెల్లిమర్ల గ్రామ దేవత శ్రీ పూడమ్మతల్లి వారాల పండుగ మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని అమ్మవారి చదురుగుడి వద్ద వేకువ జామున ఐదు గంటల నుంచే భక్తులు రాక మొదలైంది. పట్టణమంతా అమ్మవారి ఘటాలు ఊరేగించారు.

పైడితల్లికి చల్లదనం

విజయనగరం/ విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి మంగళవారం భక్తులు చల్లదనం నిర్వహించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, శ్రీకాకుళం, మన్యం, అల్లూరి సీతారామ రాజు జిల్లాల వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ పాల్గొని నగరంలోని ఒకటి, 20, 21 డివిజన్‌లో ఉన్న తూర్పు బలిజివీధి, నల్లావీధి, బుచ్చెన్నకోనేరు, కొత్తూరు ప్రాంతాలకు చెందిన భక్తులతో కలిసి భారీగా అమ్మవారికి ఘటాలు సమర్పించారు. అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో యువత, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు

నెలాఖరులోగా బ్యాక్ లాగ్ పోస్టుల నోటిఫికేషన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఎస్సీ ఎస్టీ కులాల బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకానికి ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ జారీ చేయాలని సోషల్ వెల్ఫేర్ డీడీని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఈ నెల 25లోగా ఖాళీల వివరాలు, రోస్టర్ పాయింట్లను, పోస్టుల విద్యార్హతలు తదితర సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు బ్యాక్ లాగ్ పోస్టుల నియామకానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఖాళీగా ఉన్న తలయారీ పోస్టులను భర్తీ చేయాలని సభ్యులు కోరగా నోటిఫికేషన్ జారీ చేయడానికి వివరాలను సేకరించాలని డీఆర్‌ఓ అనితకు సూచించారు. సమావేశంలో సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, సోషల్ వెల్ఫేర్ డీడీ దయానంద్, జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

విజయనగరం క్రైమ్: ఇంటిపన్ను అంచనా వేయడానికి లంచం డిమాండ్ చేసిన ఇద్దరు మున్సిపల్ అధికారులను 2014లో ఏసీబీ ట్రాప్ చేసి పట్టుకుని, కోర్టుకు అప్పగించింది. ఈ కేసులో సంబంధిత నిందితులకు జరిమానా, జైలుశిక్ష విధిస్తూ కోర్టు సోమవారం తీర్పు చెప్పిందని ఏసీబీ డీఎస్పీ పి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలిలా ఉన్నాయి. 2014లో పట్టణంలోని అరకాల వీధికి చెందిన కె.శ్రీనివాస్ స్నేహితుడు కొత్త ఇల్లు కట్టుకోవడానికి సాయమందించాడు. అయితే ఆ ఇంటిపన్ను అంచనా వేయడానికి, నిర్ధారించేందుకు అప్పటి మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వారిద్దరూ పసుపు రెడ్డి ఈశ్వరరావును కలిశారు. ఈ క్రమంలో ఆయన రూ. 10వేలు లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీకి ఫిర్యాదుచేశారు. ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి ఆర్‌ఐతో పాటు బిల్ కలెక్టర్ దొప్పల పూడి వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం విశాఖ ఏసీబీ కోర్టు ఈశ్వరరావుకు మూడేళ్ల జైలు, రూ.15వేలు జరిమానా, వెంకటేశ్వరరావుకు ఆరు నెలల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని డీఎస్పీ పేర్కొన్నారు.

'ఉపాధి' కోసం గ్రామసభ



గరివిడి మండలంలో నిర్వహిస్తున్న గ్రామసభ (ఫైల్)

- జిల్లాలో 774 పంచాయతీలు
- 724 సభలు పూర్తి

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలులోకి రాకముందు గ్రామీణ ప్రాంత ప్రజలు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారు. ఈ నేపథ్యంలో వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిన తర్వాత వలసలు గణనీయంగా తగ్గాయి. ఈ పథకంలో సొంత గ్రామంలోనే పనులు కల్పిస్తారు. ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తారు. ముందుగా ప్రథమ సభలు, తుది గ్రామసభలు నిర్వహిస్తారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామసభలో గ్రామంలో ఏఏ రకం పనులు ఎక్కడెక్కడ నిర్వహించాల్సి ఉంటుందో అంచనా వేసి పంచాయతీలో తీర్మానం చేసి మండల పరిషత్‌కు పంపిస్తారు. అక్కడ ఆమోదం పొందిన తర్వాత జిల్లా పరిషత్‌కు, అక్కడినుంచి కలెక్టర్‌కు అడ్మిన్ అప్రూవల్ కోసం పంపిస్తారు.

జిల్లాలో వేతనదారులు 6.87 లక్షల మంది

జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జిల్లాలో 3.81 జాబ్ కార్డులు ఉన్నాయి. వాటిలో యాక్టివ్ కార్డులు 3.49 లక్షలు ఉన్నాయి. 6.87 లక్షల మంది వేతనదారులు ఉన్నారు.

జరుగుతున్న గ్రామసభలు

2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల కోసం జిల్లాలోని 774 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాల్సి ఉండగా ఇప్పటికే 724 గ్రామ పంచాయతీల్లో ప్రథమ గ్రామసభలు పూర్తి చేశారు. తుది గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది.

2023–24లో 1.97 కోట్ల పనిదినాల లక్ష్యం

వేతనదారులకు 2023–24 లో 1.97 కోట్ల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు 1.57 కోట్ల పనిదినాలు కల్పించారు. జూలై నెలఖారు నాటికి 1.50 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉండగా 1.57 కోట్ల పనిదినాలు కల్పించారు. వేతనదారులకు ఇచ్చే వేతనం రూ. 380.52 కోట్లు ఖర్చు చేశారు. మెటీరియల్ కోసం రూ.111. 46 కోట్లు ఖర్చు చేశారు.

ఉపాధి హామీ పథకంలో నిర్వహించే పనులివే

చెరువుల్లో పూడికతీత, చెరువులు లోతు చెయ్యడం, అమృత్ సరోవర్ పథకానికి ఎంపికైన కొత్త చెరువులు తవ్వడం, మొక్కలు నాటడం, ట్రెంచ్ కటింగ్, రింగ్ కటింగ్ చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి అప్రోచ్ రోడ్, ఉద్యాన పంటల సాగులో భాగంగా మొక్కలు నాటడానికి అవసరమైన గోతులు తవ్విఫిట్ చేయడం, గ్రావెల్ రోడ్లు, కల్వర్టులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కందకాలు, ఫారంపాండ్స్ తవ్వడం వంటి పనులు చేపడతారు.

2 నుంచి ప్రారంభమైన గ్రామసభలు



2024– 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించేందుకు పంచాయతీల్లో అక్టోబర్ 2వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నాం. గ్రామంలో ఏ రకం పనులు చేపడతారో ప్రజాప్రతినిధులు, ప్రజలు చర్చించుకుని గుర్తిస్తారు. నవంబర్ 10 వరకు గ్రామసభలు జరుగుతాయి.

– జి.ఉమాపరమేశ్వరి, డ్వామాపీడీ